# ఒక యోధుడి నిష్క్రమణ

## డా.జగదీష్‌బాబు హఠాన్మరణం

## సాయంత్రం 5గంటలకు ఖమ్మంలో ర్యాలీ

**వనం నాగయ్య, కెరటం న్యూస్**

వేలాది ప్రాణాలు కాపాడిన చేతులు... ఇప్పుడు శాశ్వతంగా ఆగిపోయాయి. అనేక మంది ప్రాణాలను కాపాడిన వైద్యుడు ఇక లేరు.. ఆదివారం సూర్యాపేట సమీపంలో పిల్లలమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ న్యూరో సర్జన్ డా.కే.జగదీష్‌బాబు మృతిచెందారు. డా.జగదీష్‌బాబు ప్రయాణిస్తున్న కారు రోడ్డు డివైడర్‌కు ఢీకొనడంతో మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం పూర్తిచేసి కుటుంబసభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డా.జగదీష్‌బాబు మృతికి ఖమ్మం ఐఎంఏ, మమత హాస్పిటల్స్ తమ ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..ఒక వైద్యుడు అంటే కేవలం ఆసుపత్రిలో చికిత్స అందించే వ్యక్తి కాదు... ఒక కుటుంబానికి ఆశ... ఒక తల్లిదండ్రులకు ధైర్యం... ఒక రోగికి ప్రాణం మీద నమ్మకం... అలాంటి వేలాది కుటుంబాలకు అండగా నిలిచిన ప్రముఖ వైద్య నిపుణుడు, ప్రఖ్యాత న్యూరో సర్జన్ డా. కే. జగదీష్ బాబు ఇక లేరు.ఊహించని రోడ్డు ప్రమాదం ఆయన ప్రాణాలను బలిగొనడంతో వైద్య రంగం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. ఆయన మరణవార్త తెలిసిన రోగులు, వారి కుటుంబ సభ్యులు, వైద్యులు, స్నేహితులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మెదడు, నరాలకు సంబంధించిన సమస్యలు అత్యంత క్లిష్టమైనవిగా వైద్యరంగంలో భావిస్తారు. అలాంటి పరిస్థితుల్లో రోగులకు ధైర్యం చెప్పి, క్లిష్టమైన న్యూరో సర్జరీలు నిర్వహిస్తూ ఎన్నో కుటుంబాల్లో ఆశలు నింపారు డా. జగదీష్ బాబు తీవ్రమైన అనారోగ్యంతో ఆసుపత్రి గుమ్మం తొక్కిన ఎంతోమంది రోగులు... ఆయన చికిత్సతో తిరిగి తమ కుటుంబాల మధ్యకు వెళ్లారు. ఎంతోమంది తల్లిదండ్రులకు తమ పిల్లలను తిరిగి అందించారు. ఎంతోమంది కుటుంబాలకు తమ ఆప్తులను తిరిగి చూసే అవకాశం కల్పించారు. అందుకే ఆయనకు చికిత్స చేయించుకున్న అనేక కుటుంబాలకు ఆయన కేవలం డాక్టర్ కాదు... ప్రాణదాత.

### ఒక ఫోన్ కాల్...
### ఎన్నో కుటుంబాల్లో విషాదం


ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారనే వార్త...ఆ తర్వాత ఆయన ఇక లేరనే విషాద సమాచారం...ఈ వార్తను విన్న ఎంతోమందికి నమ్మశక్యంగా లేదు. "నిన్నటి వరకు ఎంతోమందికి ప్రాణం పోసిన డాక్టర్... ఈరోజు మన మధ్య లేరు" అనే వాస్తవం ఆయనను అభిమానించిన వారిని కలచి వేస్తోంది. ఆయన చేత చికిత్స పొందిన రోగులు, వారి కుటుంబ సభ్యులు తమ జీవితాల్లో డా. జగదీష్ బాబు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యంతమవు తున్నారు.

### వైద్య రంగానికి తీరని లోటు

ఒక అనుభవజ్ఞుడైన వైద్య నిపుణుడిని కోల్పోవడం ఆయన కుటుంబానికే కాదు... ఆయన సేవలు అందించిన సమాజానికి కూడా తీరని లోటు. ప్రత్యేకించి న్యూరో సర్జరీ వంటి అత్యంత క్లిష్టమైన వైద్య విభాగంలో తన సేవలను అందించిన డా. జగదీష్ బాబు ఆకస్మిక మరణం వైద్య రంగంలో విషాదాన్ని నింపింది. ఆయనతో కలిసి పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బంది ఆయన వృత్తిపరమైన నైపుణ్యాన్ని, రోగుల పట్ల చూపిన శ్రద్ధను, మానవతా దృక్పథాన్ని స్మరించుకుంటున్నారు.

### ఒక యోధుడి నిష్క్రమణ

ప్రాణాలను కాపాడటాన్ని తన వృత్తిగా ఎంచుకున్న ఒక వైద్య యోధుడు...తన జీవిత ప్రయాణాన్ని అర్ధాంతరంగా ముగించుకోవడం నిజంగా విషాదకరం. ఆయన వెళ్లిపోయారు... కానీ ఆయన కాపాడిన ప్రాణాలు ఆయన కథను చెబుతూనే ఉంటాయి. ఆయన లేరు... కానీ ఆయన సేవలు ఆయనను చిరస్మరణీయుడిగా నిలబెడతాయి. ఆయన స్వరం ఇక వినిపించకపోవచ్చు...కానీ ఆయన చేతుల్లో కొత్త జీవితం పొందిన కుటుంబాల ప్రార్థనల్లో ఆయన పేరు ఎప్పటికీ ఉంటుంది. డా. కే. జగదీష్ బాబు గారికి ఘన నివాళి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు, స్నేహితులకు, రోగులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు.



### ప్రముఖుల సంతాపం...

ప్రముఖ న్యూరో సర్జన్ డా.కే.జగదీష్‌బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్త తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రముఖ వైద్య నిపుణులు డా.కంభంపాటి నారాయణరావు,డా. కూరపాటి ప్రదీప్‌కుమార్, డా.వేము గంగరాజు, డా.వరికూటి సుబ్బారావు, డా.ఎంఎఫ్ గోపీనాథ్, డా.జీవీ, డా.జి.శ్యామ్‌కుమార్, డా.బాబూ రత్నాకర్, ఐఎంఏ బాధ్యులు డా.రెహానాబేగం, డా.యలమంచిలి రవీంద్రనాథ్, డా.బొల్లికొండ శ్రీనివాసరావు, డా.శ్రీధర్‌గౌడ్, డా.సురేందర్‌నాథ్ గౌడ్, డా.గట్టినేని సురేష్, డా.విమల అంబటి, డా.పెంట్యాల అసాధారణ్, డా.రాంప్రసాద్ నారగాని, జడ్ ఎస్, జయపాల్ విజయ్‌కుమార్, డా. కేసగాని రాజశేఖర్‌గౌడ్, డా.నిరంజన్‌కుమార్, డా.జీవీ మురళి, డా.మారుతిబాబు, డా.సునీల్ కుమార్ జంగాల, డా.కావ్యచంద్, డా.కేసోజు భరత్‌బాబు, డా.అల్లంపాటి రమేష్‌రెడ్డి, డా.బాలభాస్కర్‌రెడ్డి, డా.ఎంజీవీ ప్రవీణ్, డా.మోపర్తి సురేష్‌బాబు, డా.ఎస్‌పీవీ కిషోర్‌బాబు, డా.ఎం.నీరజ, డా.సీహెచ్ రాకేష్, డా.సీతారాం, డా.అళనె ప్రవీణ్‌కుమార్, డా.శీలం పాపారావు, డా.నైమా సుల్తానా, డా.ఏ.మోహన్, డా.చౌహాన్, ధనాల ప్రసాద్(సుగుణ హాస్పిటల్స్), ఎండీ పాషా(క్యూర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్) మాలమహానాడు ఖమ్మం జిల్లా కమిటీ తరపున గుంతేటి వీరభద్రం, దాసరి శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు పల్లా రాజశేఖర్, మద్రి ప్రకాశ్, తదితరులు తమ సంతాపం తెలిపారు.

### నేడు సాయంత్రం ఖమ్మంలో ర్యాలీ

డా.జగదీష్‌బాబు అకాల మృతికి ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఐఎంఏ, మమత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అంతిమయాత్ర నిర్వహిస్తున్నట్టు ఖమ్మం ఐఎంఏ, మమత హాస్పిటల్స్ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండి మమత హాస్పిటల్ వరకూ ర్యాలీ ఉంటుందని వారు తెలిపారు.